అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా.!

- 13వ వార్డులో నిరుపయోగంగా పలు ప్రాంతాలు
- నిత్యం మందుబాబులు, గంజాయి బ్యాచ్ హడావుడి
- పోలీసులు దృష్టి సారించాలని ప్రజల విజ్ఞప్తి


ఆరిలోవ శివారు శివాజీనగర్‌–2లో ఖాళీ గదులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో నిరుపయోగంగా ఉన్న నిర్మాణాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. మద్యం, గంజాయి బాబులకు అడ్డాగా మారాయి. ఆరిలోవ కాలనీ శివారు శివాజీనగర్‌–2లో ఉన్న 'రే'తాత్కాలిక నివాసాలు, ఇక్కడికి సమీపంలో ఉన్న మార్కెట్ యార్డు కోసం నిర్మించిన షాపులు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో పాటు ముడసర్లోవ రిజర్వాయర్ వెనక ఉన్న రోడ్లలో కూడా యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి.

రే తాత్కాలిక నివాసాలు

ఆరిలోవ ప్రాంతం సూర్యతేజానగర్‌ను జీవీఎంసీ మురికివాడగా గుర్తించింది. ఈ మేరకు 2012లో రాజీవ్ ఆవాస్ యోజన(రే) పథకం కింద ఈ కాలనీని అభివృద్ధి చేయడానికి సిద్ధమైంది. అనంతరం కొన్నాళ్ల తర్వాత ఈ పథకంలో భాగంగా ఇక్కడ 204 మంది లబ్ధిదారులకు నివాసాలు నిర్మించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. 2015లో ఇక్కడున్న నివాసాలు ఖాళీ చేయించి లబ్ధిదారుల కోసం తాత్కాలిక ×రే\`నివాసాలను శివాజీనగర్‌–2 సమీపం పార్వతీనగర్ గెడ్డ అంచున నిర్మించారు. ఈ నేపథ్యంలో సూర్యతేజానగర్‌లో రే ఇళ్లు పూర్తికావడంతో ఈ తాత్కాలిక నివాసాల నుంచి నాలుగు, ఐదు కుటుంబాలు తప్పా, మిగిలిన సుమారు 100కు పైగా కుటుంబాలు కొత్త నివాసాల్లోకి తరలిపోయారు. దీంతో ఖాళీగా ఉన్న తాత్కాలిక నివాసాలు రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మందుబాబులు మద్యం బాటిళ్లు తీసుకొచ్చి బార్లు మాదిరిగా ఈ గదులను వినియోగించుకుంటున్నారు. గంజాయి పీల్చడం, పేకాట, అశ్లీల కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ గదులను షాపింగ్ కాంప్లెక్స్‌గా వినియోగించడమో, లేదంటే ఖాళీగా ఉన్న ఈ గదులను తొలగించడమో చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఓపెన్ బార్‌లా షాపింగ్ కాంప్లెక్స్


ఆరిలోవ కాలనీలో నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్

ఆరిలోవలో జీవీఎంసీ నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఓపెన్ బార్‌ను తలపిస్తోంది. ఇది ఖాళీగా ఉండడంతో మందుబాబులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. కాలనీ శివారున నివాసాలను ఆనుకొని ఈ షాపింగ్ కాంపెక్స్ ఉంది. ఇక్కడ రోజూ మందుబాబులు మద్యం తాగుతూ హల్‌చల్ చేస్తున్నారు. రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన ఈ షాపింగ్ కాంప్లెక్స్‌ను జీవీఎంసీ అధికారులు వినియోగంలోకి తీసుకురాలేదు. 42 షాపుల నిర్మాణం కోసం సుమారు రూ.50 లక్షలతో 2018లో చేపట్టిన పనులు 2019కి పూర్తయ్యాయి. అప్పటి నుంచి ఇంతవరకు దీన్ని వినియోగించకుండా వదిలేశారు. దీంతో మందుబాబులకు కలిసొచ్చింది. పగిలిన గాజు పెంకులు, ఖాళీ మద్యం సీసాలు, ఖాళీ వాటర్ పేకెట్లు, పాస్లిక్ గ్లాసులతో ఈ ప్రాంతం అస్తవ్యస్తంగా మారిపోయింది. జీవీఎంసీ అధికారులు ఇక్కడ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మో.. ముడసర్లోవ రోడ్లు


నిర్మానుష్యంగా ముడసర్లోవ రోడ్లు

ముడసర్లోవ రోడ్లను కూడా ఆకతాయిలు వదలడం లేదు. రిజర్వాయర్ వెనక విశాలమైన డబుల్ రోడ్లు ఉన్నాయి. ఓ పక్క కంబాల కొండలు, మరో పక్క దట్టమైన ముళ్ల పొదలు ఉండడంతో ఇటువైపు ఎక్కువగా వాహనచోదకులు వెళ్లరు. దీంతో ఈ ప్రాంతం మందుబాబులు, అశ్లీల కార్యకలాపాలు, గంజాయి బ్యాచ్‌లకు అడ్డాగా మారిపోయింది. గతంలో ఇక్కడ కొందరు ఆటోల్లో మహిళలను తీసుకెళ్లి అత్యాచారాలకు పాల్పడే సంఘటనలు చోటు చేసుకున్నాయి. గతంలో ఓ మహిళను హత్య చేసి ఇక్కడ తుప్పల్లో పడేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఒంటరిగా బైక్‌పై కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పోలీసులు స్పందించి ప్రత్యేక నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

శంకర్ ఫౌండేషన్‌లో ఉచిత కంటి పరీక్షలు


మాట్లాడుతున్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి మద్దిలపాలెం ఇన్‌చార్జి ఉషా ఆత్మకూరి

మద్దిలపాలెం: శంకర్ ఫౌండేషన్ మద్దిలపాలెం కంటి ఆస్పత్రిలో ఈ నెల ఒకటి నుంచి 30వ తేదీ వరకూ ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించనున్నామని ఆస్పత్రి ఇన్‌చార్జి ఉషా ఆత్మకూరి తెలిపారు. ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో 25 పడకలతో మద్దిలపాలెంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిని తీర్చిదిద్దామన్నారు. సీనియర్ సిటిజన్‌లు, తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా పరీక్షలు చేస్తామన్నారు. దీంతో పాటు ఫార్మసీలో 10 శాతం తగ్గింపు, కంటి శుక్లాల శస్త్ర చికిత్సలో వివిధ ప్యాకేజీలపై 10 శాతం తగ్గింపు ఇవ్వనున్నామన్నారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, సీజీహెచ్‌ఎస్, ఐసీఐ తదితర సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ నేత్ర వైద్యురాలు రేస్మి రత్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగారురాజు పాల్గొన్నారు.

జ్ఞాన ధర్మ ప్రచారం


ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక బృందం సభ్యులు

మద్దిలపాలెం : త్రైత సిద్ధాంత ఆదికర్త, సాంద్ర సింధు వేద ప్రదాత, ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల ఆశీస్సులతో బుధవారం పల ప్రాంతాల్లో జ్ఞాన ధర్మ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధనందా యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పంపిణీ చేశారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల గురించి వివరంగా తెలుసుకోవడం అవసరమన్నారు.

తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు


ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న వడ్లమూడి ఫౌండేషన్ సభ్యులు

బీచ్ రోడ్డు: తీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను వడ్లమూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. ఆర్కేబీచ్ నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు ఉన్న వ్యర్థాలను తొలగించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాండు రంగారావు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా సముద్ర జీవరాశుల అంతరించిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ తీరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోస్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి పుష్పాల సమర్పణ


శ్రీవారికి పుష్పాలు సమర్పిస్తున్న దాతలు

కొమ్మాది: రుషికొండలోని ఆలయంలో కొలువుదీరిన మహాలక్ష్మి, గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామికి నగరానికి చెందిన పాల్గుణరాజు, భారతి దంపతులు పుష్పాలను సమర్పించారు. ఏకాదశిని పురస్కరించుకుని వివిధ వర్ణాల సుమాలను స్వామి అలంకరణకు తీసుకువచ్చారు. తోమాల సేవకు 12 వేల రూపాయలను సమర్పించారు. కార్యక్రమంలో కార్తీకదీపోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతానికి సహకారం


తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీకి పుష్పగుచ్ఛం ఇచ్చి గౌరవిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్..

ఆరిలోవ : జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పి.ఎం.బాలాజీ బుధవారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వారు సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. ఏయూలో నిర్వహిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సుల గురించి చర్చించారు. ఈ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా తగిన సహకారం అందించాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీని కోరారు. ఈ మేరకు స్పందించిన బాలాజీ మాట్లాడుతూ జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జపనీస్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీ సెంటర్ డైరెక్టర్, ఫారిన్, లింగ్విస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, నన్నయ వర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య ఎం.జగన్నాథరావు పాల్గొన్నారు.

కెమికల్ ఇంజనీరింగ్ వర్క్‌షాప్


వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ఏయూ ఆచార్యులు

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీలో కెమికల్ ఇంజనీరింగ్ విభాగంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ సమత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ప్రొఫెసర్ ఎస్.వి.నాయుడు, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ–మొబలిటీ, మోడలింగ్ అండ్ కంట్రోల్ ఆఫ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఆర్.పద్మశ్రీ, సైంటిస్ట్ శ్రీనివాస్ కుమార్, ప్రొఫెసర్ శేషగిరిరావు, ప్రొఫెసర్ ఎం.వి.వి.చందన లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన కృష్ణాలయం ప్రతిష్ట మహోత్సవాలు


ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మేయర్ గొలగాని, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువులో శ్రీకృష్ణాలయ ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. తోటగరువులో నిర్మించిన ఈ ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు గత నెల 28 నుంచి కొనసాగుతున్నాయి. అప్పటి నుంచి పలు పూజా కార్యక్రమాలు చేపట్టిన ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం హోమం, విగ్రహాల ప్రతిష్ఠించే కార్యక్రమాలతో ముగించారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, శాసనమండలి సభ్యుడు యనమల రామకృష్ణుడు, స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఆలయాన్ని సందర్శించారు. వారికి ఆలయ కమిటీ పెద్దలు ఒమ్మి చిన్నారావు, ఒమ్మి సన్యాసిరావు, తదితర సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అతిథుల పేరిట అర్చకులు శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తదితరులు ఉత్సవంలో పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

పొగాకు నిర్మూలనపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

మహారాణిపేట: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సత్యం జంక్షన్ మీదుగా తిరిగి కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ పొగాకు వినియోగం ఒక జీవితాన్నే కాకుండా కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని.. అందుకే భారత ప్రభుత్వం పొగాకును కొన్ని బహిరంగ ప్రదేశాల్లో వినియోగించడం నిషేధించిందన్నారు. ప్రతీ ఏటా పొగాకు, ధూమపానం చేయడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించేందుకు మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటామన్నారు. దీన్ని వినియోగాన్ని తగ్గించుకుంటూ పోవడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొందని డీఎంహెచ్‌వో అన్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో ప్రకటనల రూపంలో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. భావితరాలకు ఎలాంటి నష్టాలు జరుగుతాయో ప్రభుత్వాలు ప్రజలకు తెలియచేస్తున్నాయన్నారు. ఎన్‌జీవోలు, రైతులు, యువత, విద్యార్థులు అందరు పాల్గొని పొగాకు రహిత భారత దేశ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యుడు రమారెడ్డి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తుల వివరాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

అలరించిన సాహిత్య గోష్టి


మాట్లాడుతున్న డాక్టర్ వేణు

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన సాహిత్య గోష్టి కార్యక్రమం అలరించింది. సభాధ్యక్షుడు డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ సాహిత్యం, సాహితీ సమావేశాలు మన భాష, సంస్కృతులను సమాజానికి పరిచయం చేసి తెలుగు భాష ఉన్నతికి కృషి చేస్తాయన్నారు. ఈ గోష్టిలో కె.వి.ఎస్.మూర్తి, కాళీపట్నం రామారావు రచించిన జీవధార, విజయచంద్ర గూడు కవితపై కె.జి.వేణు వ్యాఖ్యానం, వేదుల సత్యనారాయణమూర్తి పద్యధారపై సిహెచ్.చినసూర్యనారాయణ, ఆదూరి సీతారామమూర్తి కథా సంపుటిపై బి.రాధారాణి, విశాఖ తెలుగు కథ గురించి డి.వి.సూర్యారావు ప్రసంగించారు. పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణకు స్వర నివాళి


కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాయనీ గాయకులు, కళాకారులు

సీతంపేట: పల్లవి మ్యూజిక్ సినీ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయనీ గాయకులు సూపర్ స్టార్ కృష్ణ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి అలరించారు. దివంగత సినీ దిగ్గజం కృష్ణ జయంతిని పురస్కరించుకుని పల్ల బాబ్జి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమాన్ని కళాకారులు సన్‌మూర్తి, వెంకటేష్ మాస్టారు, బాబ్జి, హారిక, ఖాన్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాయనీ గాయకులు భాగ్యలక్ష్మి, సి.వి.రాజేశ్వరి, శైలజ, మాధురి, కల్యాణి, అమ్మాజీరావు, మహమ్మద్ ఖాన్, నాగేశ్వరరావు, వెంకట్ నాయుడు, మను పల్ల, రాధారాణి హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను రంజింపజేశారు.

పోర్టు ఉద్యోగుల సమస్యలపై వినతి


పోర్టు చైర్మన్ అంగముత్తును సత్కరిస్తున్న మాజీ ట్రస్టీ మళ్ల వెంకటరావు

సీతంపేట: విశాఖపట్నం పోర్టు అథారిటీ కొత్త చైర్మన్ అంగముత్తును బుధవారం పోర్టు అథారిటీ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కందాల ప్రభాకరరావు, మాజీ పోర్టు ట్రస్టీ మళ్ల వెంకటరావులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, పెన్షనర్లు, కలాసీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయన వినతిపత్రం అందజేశారు. 2020 నుంచి కొంత మందికి ఆపేసిన విడో పెన్షన్‌ను పునరుద్ధరించాలని, 25 ఏళ్ల నుంచి పూల్ కలాసీలుగా పనిచేస్తున్న వారికి అర్హత కలిగిన శాశ్వత ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, టైం స్కేల్ అమలు చేయాలని, శాశ్వత ఉద్యోగుల మాదిరిగా బోనస్ ప్రకటించాలని, గుండు అప్పలరాజు అనే విశ్రాంత ఉద్యోగి తాలూకా పెండింగ్‌లో ఉన్న పే పిక్సేషన్ ఏరియర్స్ చెల్లింపు సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. చైర్మన్ స్పందిస్తూ సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పూల్ కలాసీల నాయకులు శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు


సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు

ఉక్కునగరం: దేశ పాలకులు అనుసరిస్తున్న విధానాల మూలంగా లబ్ధి పొందే కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవడం కార్మికుల కర్తవ్యమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి. నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కునగరం సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన × కార్మిక ఉద్యమం–నూతన పరిస్థితులు\` సదస్సులో ఆయన మాట్లాడారు. సీఐటీయూ లక్ష్యం కార్మికులను, సంఘాలను ఏకం చేసి, ఐక్య ఉద్యమాలతో ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించడమన్నారు. నియంతృత్వ నాయకుల కారణంగా వ్యవస్థలు గాడి తప్పుతున్నాయన్నారు. అమిత అధికార దాహం కలిగిన నాయకుల చేతి నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ ప్రసంగించిన కార్యక్రమంలో కె.ఎం.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, నమ్మి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ తనిఖీలు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలోని మూడు విత్తన గొడౌన్లలో విజిలెన్స్ అధికారులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐలు కోటేశ్వరరావు, లక్ష్మోజీ విత్తన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యవసాయశాఖకు సమర్పించిన రికార్డులకు అనుగుణంగానే విత్తనాలు నిల్వ చేశారని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా డీలర్లు వ్యవహరించలేదని గుర్తించామని సీఐలు కోటేశ్వరరావు, లక్ష్మోజీ చెప్పారు.

అమ్మవారికి అరటిపండ్లతో అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని బుధవారం అరటిపండ్లతో అలంకరించి, భక్తులు దర్శనాలు కల్పించారు. ఈ అలంకరణలో అరటిచెట్లను కూడా ఆలయానికి, విగ్రహానికి వినియోగించారు. వారానికో అలంకరణతో అమ్మవారిని తీర్చిదిద్దుతున్న ఆలయ కమిటీ ప్రతి పౌర్ణమికి ముందు వచ్చే బుధవారం ప్రత్యేక అలంకరణలకు పాధాన్యం కల్పిస్తున్నారు. దీంతో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, భక్తి పారవశ్యం చెందుతున్నారు. ఈ ఆలయాన్ని అనుసరించి చుట్టుపక్కల ఆలయ కమిటీలు కూడా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి, భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు.

రైతు బజార్లలో వసతులు కల్పిస్తాం

- సీఈవో నందకిశోర్


గోపాలపట్నం రైతు బజారులో రైతులతో మాట్లాడుతున్న సీఈవో నందకిశోర్

గోపాలపట్నం: రైతు బజార్లలో మౌలిక వసతులు కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ రైతు బజార్ల ముఖ్యకార్యనిర్వాహక అధికారి ఎం.నందకిశోర్ తెలిపారు. ఆయన బుధవారం రాత్రి గోపాలపట్నం రైతు బజారులో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇక్కడి పరిస్థితులు.. రైతు ఇబ్బందులు గురించి ఆరా తీశారు. రెండో పూట బజారు జరుగుతున్న సమయంలో లైటింగ్ లేక ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆయనతో పాటు జిల్లా వ్యవసాయ మార్కెట్ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ ఎర్రన్న, అసిస్టెంట్ డైరెక్టర్ షేక్ యాసిన్, గోపాలపట్నం రైతు బజారు ఈవో నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 839వ రోజుకు చేరుకున్నాయి. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మినీ వ్యాన్ చోరీ

తగరపువలస: చిట్టివలస కార్మికవాడకు చెందిన గుజ్జు సూరిబాబు అనే వ్యక్తికి చెందిన సుప్రో మినీ వ్యాన్ ఈ నెల 25న ఇంటి వద్ద చోరీకి గురైంది. ఈ మేరకు బుధవారం భీమిలి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వారం రోజుల పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా వ్యాన్ జాడ కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల ఫైనాన్స్ చేయించిన ఈ వాహనాన్ని ఇంటి ముందు పార్క్‌చేసి మరుసటిరోజు చూడగా కనిపించలేదన్నారు. ఈ మేరకు భీమిలి పోలీసులు గురువారం వాహనం చోరీపై దర్యాప్తు చేయనున్నారు.

కల్యాణం.. కమనీయం


అప్పన్న కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరి శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.